www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 21 జులై 2023


5

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

బాలికల హాస్టల్‌ను పరిశీలించిన మంత్రి వేణు

ప్రజాశక్తి-రామచంద్రపురం

వేలంపాలెం గ్రామంలో గల మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల హాస్టల్‌ను రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి వేణుగోపాలయిష్ణ గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా ఆయన ఇక్కడ విద్యార్థినిలతో మాట్లాడారు. వంట గదిలో విద్యార్థులకు వండిన ఆహార పదార్థాలను మంత్రి పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు వినియోగించుకుని విద్యార్థులు బాగా రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి అంబటి భవాని, గ్రామ సర్పంచ్ టేకుమూడి సుజాత, ఇతర వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి వేణు

భయం గుప్పెట్లో తీర గ్రామాలు

- వరదల సీజన్ అంతా అటెన్షన్
- అధికార యంత్రాంగంలో నిర్లిప్తత

ప్రజాశక్తి-మామిడికుదురు

గోదావరి ఎర్ర నీరు వచ్చిందంటే లంక గ్రామాల తీర ప్రాంత ప్రజల గుండెల్లో గుబులు రేగుతుంది. గడిచిన నాలుగు దశాబ్దాలలో 12 పర్యాయాలు గోదావరి ఉగ్రరూపం లంక గ్రామాల ప్రజలకు రైతులకు తీరని నష్టాలు గురిచేసాయి. వరదలవల్ల వందలాది ఎకరాల సారవంతమైన లంక భూములు నదీపాతమవుతున్నాయి. వరదల ఉగ్రరూపం దాల్చే సమయంలోనే అధికారులు హడావిడిగా రక్షణ చర్యలు చేపట్టడం పరిపాటిగా మారింది. ముందస్తు చర్యలు కానరావడం లేదు.

వరదొస్తే జిల్లాలో చేతులెత్తేయాల్సిందే

జిల్లాలో 22 మండలాలు ఉన్నాయి. 18 మండలాల పరిధిలో సుమారు 80 నది తీర గ్రామాలు వరద తాకిడికి గురవుతున్నాయి. ఈ గ్రామాల్ని నదీపాయలకు ఏటిగట్టుకు మధ్యలో ఉన్నాయి. 2022 వరదలలో గోదావరి వరద ఉగ్రరూపం దాల్చడంతో మానేపల్లి, పాసర్లపూడిలంక తదితర ప్రాంతాలలో ఏటి గట్టుపై వరద నీరు ప్రవహించింది. అప్పట్లో తగ్గుముఖం పట్టడంతో పెద్ద ముప్పు తప్పింది. జిల్లాకు పార్లమెంటు సభ్యులు, ఏడుగురు ఎంఎల్ఏలు, ఇద్దరు ఎంఎల్సిలు, ఒక రాజ్యసభ సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరందరూ అధికార పార్టీకి చెందిన వారే జనాకర్షక పథకాలతో ప్రచారాలతో పరిమితమవుతున్నారే తప్ప వరదల సమయంలో లంక గ్రామ ప్రజల ఇబ్బందులకు గురయ్యే దీర్ఘకాల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించడం లేదని ఆయా ప్రాంతవాసులు వాపోతున్నారు. ఎన్నికలు సమీపించే సమయంలో దీర్ఘకాల సమస్యల పరిష్కారం పై దృష్టి సారిస్తామంటూ మభ్యపరుస్తూ కార్యాచరణపై దృష్టి సారించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

రవాణా వ్యవస్థ స్తంభిస్తుంది

వరద ఉగ్రరూపం దాల్చిందంటే కరకట్ట దిగువ రహదారులు పూర్తిగా నీట మునిగి రవాణా వ్యవస్థ స్తంభించిపోతుంది. లంక గ్రామాలకు వెళ్లే రహదారులలో పాటు రేవులలో రోజుల తరబడి వరద నీరు ప్రవహిస్తుంది. ప్రధాన పాటు రేవులలో 10 అడుగుల ఎత్తులో కాజ్ వే నిర్మించాల్సిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమై కార్యరూపం దాల్చడం లేదు. వరదల సమయంలో బాధితులను పల్లపు ప్రాంతాల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు కీలకంగా నాటు పడవలే పని చేస్తాయి. ముందస్తుగా అధికారులు పడవలు ఏర్పాటు చేయకపోవడం, ఏర్పాటు చేసిన వారికి రోజుల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో అహనానికి గురై నావలు తిప్పుడు వారు స్పష్టం చేస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

జిల్లాలో 18 మండలాల పరిధిలో అవస్థలు

వరదలు ఉధృతి పెరిగితే విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. 18 మండలాల పరిధిలో 80 లంక గ్రామాల ప్రజలు అంధకారంలో కాలం వెళ్ల దీస్తుంటారు. అదే సమయంలో వరద ఉధృతితో కొట్టుకు వచ్చిన విష సర్పాలు నివాసాలలోకి చొరబడి కాటు వేయడంతో మత్యువాత పడిన సంఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ఇంటి చుట్టూ నీరు బయట కాలు పెట్టేందుకు వీలుకాని పరిస్థితి వారికి. అనారోగ్యం వస్తే వైద్య సేవలు అందం నిత్యావసర సరుకులు కొనుగోలు చేయాలంటే కరకట్ట ఎగువ ప్రాంతాలకు వరద నీటిలో వెళ్లాల్సిందే. ఇదే అదునుగా నిత్యవసర వస్తువుల ధరలు పెంచేస్తుంటారు.



లంక గ్రామాలలో నీట మునిగిన వ్యాపార సముదాయాలు (ఫైల్ ఫోటో)

ముందస్తు చర్యలు చేపట్టాలి

ఏటా వరదల సీజన్ రావడం పరిపాటే. జూలై నుంచి సెప్టెంబర్ నెల వరకు వరద సీజన్ ఉంటుంది. జిల్లాలో వరదలలో రక్షణ చర్యలకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలి. నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచాలి.

విద్యుత్ సరఫరా పై దృష్టి సారించాలి



వరదలు గ్రామాలను ముంచెత్తితే విద్యుత్ నిలిపివేస్తారు. అయితే వరదల కారణంగా గ్రామాలు అంధకారంలో లేకుండా రాత్రి సమయంలో విద్యుత్ సరఫరా చర్యలపై అధికారులు దృష్టి సారించాలి.

-వేగి వెంకటేశ్వరరావు, పెదపట్నంలంక గ్రామం

నిత్యావసరాలు అందుబాటులో ఉంచాలి



వరదలొస్తే చేతి వృత్తులు వారు రోజుల తరబడి పనులు లేక ఉపాధి కోల్పోతారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఉపాధి కోల్పోయిన వారికి నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాలి.

- మేడేపల్లి చిన సత్యనారాయణ, ఉప సర్పంచ్, అప్పనపల్లి

తీరప్రాంతాలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-అమలాపురం

గోదావరిలో నీటిమట్టం క్రమేపి పెరిగే అవకాశాలు ఉన్నాయని జిల్లాలో తీర ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ నుండి వర్చువల్ విధానంలో జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో తుపాను హెచ్చరిక నేపథ్యంలో ముందస్తుగా చేపట్టాల్సిన విపత్తు నివారణ చర్యలు పై సమీక్షించారు. ఆయన మాట్లాడు తూ గత ఏడాది మాదిరిగానే గోదావరి వరదలు ముంపు బాధితుల సహాయక చర్యలను గత అనుభవాలతో మరింత బాగా చేపట్టాలని సూచించారు. ఏటిగట్టు పరిరక్షణకు 500 మీటర్లకు ఒక వాలంటీర్ వంతున నియమించి పర్యవేక్షణను బలోపేతం చేయాల న్నారు. అప్పనపల్లి, పెదపట్నం లంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి, పాశర్లపూడి లంక గ్రామా లలో ఏటిగట్టు పటిష్టతకు చర్యలు చేపట్టాలన్నారు పి గన్నవరం మండలంలో నాగులంక, ఎల్. గన్నవరం మానేపల్లి, మొండెపులంక ఏటిగట్టు ఎత్తును పెంచాలని ఆదేశించారు. జి.పెదపూడి, 4 లంక గ్రామాలకు బోట్ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. అయినవిల్లి మండలంలో చింతలంక తొత్తరమూడి తదితర గ్రామాల్లో వరద నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అంబాజీపేట మండలంలో డ్రైన్లు పొంగే అవకాశం ఉందని ముందస్తుగా వరద నివారణ చర్యలు చేపట్టాలన్నారు. రాజోలు మండలం నున్నవారిబాడవ, సోంపల్లి పొదలా డలంక తాటిపాక, శివకోడు లంక, సఖినేటిపల్లి మండలం అప్పన రాముని లంక, వరద సహాయక చర్యలు చేపట్టాలని ముందుగా ఆదేశించారు కార్యక్రమంలో వివిధ శాఖల తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో పెరిగిన వరద నీరు

ప్రజాశక్తి-రామచంద్రపురం

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పాటు గోదావరి ఎగువప్రాం తంలో కురిసినవర్షాలకు గౌతమీ గోదావరిలో వరద నీటి ఉధృతి పెరిగింది. కోటిపల్లి గోదావరికి వరద ఉధృతి ఎక్కువకావటంతో రేవు నిర్వాహకులు ముందు జాగ్రత్త చర్యగా కోటిపల్లి, ముక్తేశ్వరం రేవులో పడవ ప్రయాణాలు నిలుపుదల చేశారు దీంతో కోటిపల్లి ముక్తేశ్వరం గోదావరి రేవులో రాకపోకలు.ఆగిపోయాయి.

మామిడికుదురు పి.గన్నవరం మండలం గంటి పెదపూడి వద్ద నదిపై వేసిన తాత్కాలిక మట్టి రోడ్డు వరద నీట మునిగి గండిపడటంతో 4 లంక గ్రామాలకు రవాణా సదుపాయాలు స్థంభించిపోయాయి. పశుగ్రాసంతో ఉన్న పల్లపు లంకలు నీట మునగడంతో దీంతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు.



కోటిపల్లి రేవులో ఒడ్డుకు చేరిన లాంచీలు

వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలన

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలను అధికారులు గురువారం పరిశీలించారు. వివరాలు ఇవి..

కాట్రేనికోన వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల అప్రమత్తంగా ఉండాలని కాట్రేనికొన తహాసిల్దార్ సత్యనారాయణ సూచించారు. మండల పరిధిలో నడవపల్లి పంచాయతి శివారు పల్లిపాలెం,పల్లంకుర్రు రేవు,బులావారి మొండి ప్రాంతాల్లో బలహీనంగా ఉన్న ఎటుగట్టును పరిశీలించారు. 200 మంది ఉపాధి హామీ పథకం కూలీలతో ఇసుక బస్తాలను సిద్ధం చేస్తామన్నారు.

కపిలేశ్వరపురం వరద ఉధతి నేపథ్యంలో ఫ్లడ్ స్టోర్ ను గురువారం తహశీల్దార్ కె.సూర్యారావు పరిశీలించారు. ఈ సందర్భంగా స్టోర్ లో నిల్వ ఉంచిన స్టాక్ పరిస్థితిలను పిడబ్ల్యుడి జెఇ విశ్వనాథరాజును అడిగి తెలుసుకున్నారు. కపిలేశ్వరపురం మండలంలోని లంక గ్రామాలైన నారాయణలంక ,అద్దంకివారి లంక, పల్లపులంక , గ్రామాల్లోని వరద ముంపు ప్రాంతాలను తహసిల్దార్ కె సూర్యారావు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా వరద పరిస్థితులపై గ్రామస్తులు ,రెవెన్యూ సిబ్బందితో సమీక్షించారు. వరదల పట్ల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

కొత్తపేట వరద ముంపుప్రాంతాల్లో వారు అప్రమత్తంగా ఉండాలని కొత్తపేట తహశీల్దార్ జిడి.కిషోర్ బాబు సూచించారు. మండల పరిధి వానపల్లి గ్రామ శివారు వరద ముంపు ప్రాంతలైన నారాయణ లంక, సత్తెమ్మ లంక ప్రాంతాలను తహశీల్దార్ పరిశీలించారు.

మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-మండపేట

స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూకల బలరాం మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండు రోజుల నిరాహార దీక్షల్లో భాగంగా ధర్నా చేపట్టమన్నారు. ఎన్నో ఏళ్లగా పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడం సరికాదన్నారు. వారికి సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పని ఒత్తిడిని తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఎం జగన్ గత ఎన్నికలలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అధ్యక్షుడు బి.కొండా, ప్రధాన కార్యదర్శి కె.నరేంద్ర, లోవరాజు, విజయ్, రాజు, భాను, హేమలత కార్మికులు పాల్గొన్నారు.



మండపేట మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు, సిఐటియునేతల ధర్నా

పలుచోట్ల తూములకు షట్టర్ల ఏర్పాట్లు

ప్రజాశక్తి ఐ.పోలవరం

మండలంలో పలుచోట్ల వరద నీరు రాకుండా గురువారం యుద్ధ ప్రాతి పదికన అవుట్ ఫాల్ స్లూయిజ్‌లకుషట్టర్లు ఏర్పాటుచేశారు. మురమళ్ళ, కేశనకుర్రు, పాతఇంజరం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న పంట పొలాల్లోకి వరద నీరు రాకుండా ఏటిగట్టు ఆనుకొని ఉన్న తూములకు అవుట్ ఫాల్ స్లూయిజ్ నిర్మాణానికి జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లాఆదేశాలు ప్రకారం హెడ్ వర్కు సంబంధించిన శాఖ ఎఇఇ ఈశ్వరమన్యం పర్యవేక్షణలో వైసిపి మండల అధ్యక్షులు పిన్నమరాజు వెంకటపతి రాజు ఆధ్వర్యం అవుట్ ఫాల్ స్లూయిజ్‌లకు షట్టర్లు (తలుపులు)నిర్మించారు. దీనిపై రైతులు హర్షం వ్యక్తం చేశారు.

అర్హులందరికీ పథకాలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

గ్రామీణ ప్రాంతాల్లో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందిస్తున్నట్లు జెడ్‌పిటిసి సభ్యుడు బోనం సాయిబాబా, ఎంపిడిఒ నాతిబుజ్జి, తహశీల్దార్ డివిఎన్.అనిల్ కుమార్ అన్నారు గురువారం నార్కెడిమిల్లి కట్టుంగ గ్రామాల్లో సర్పంచులు పాలా నాగేశ్వరరావు, కరుటూరి బ్రహ్మాజీ అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రజలకు అవసరమైన 11 రకాల 3859 ధృవపత్రాలను అందించారు. కార్యక్రమములో అవుట్ సోర్సింగ్ డైరక్టర్ కప్పల శ్రీధర్, మండల వ్యవసాయ కమిటీ ఛైర్మన్, కనుమూరి శ్రీనివాస రాజు, ఎంపిటిసి సభ్యులు కేతా వరలక్ష్మి, పాలా చిన వెంకట రమణ, ఎపిఒ, విజయ భారతి, ఐసిడిఎస్ సూపర్ వైజర్ వి.కుమారి తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధన కోసం విఆర్ఎల రిలే దీక్షలు

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల తమ డిమాండ్ల పరిష్కారం కోసం విఆర్ఎలు గురువారం రిలే దీక్షలు ప్రారంభించారు. వివరాలు ఇవి..

ఉప్పలగుప్తం తమ సమస్యలను పరిష్కరించ నందున రాష్ట్ర విఆర్ఎ ల సంఘం పిలుపు మేరకు రిలే దీక్షలు చేపట్టినట్లు విఆర్ఎ ల సంఘం మండల అధ్యక్షుడు ఉందుర్తి అంజలరావు తెలిపారు.తమ సమస్యల పరిష్కారం కోసం గురువారం తహాశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఎ లు రిలే దీక్షలు చేపట్టారు. జూలై 20,21 న మండల కేంద్రాల వద్ద ఆగస్టు 7,8 న కలెక్టరేట్ ల వద్ద 23, 24న విజయవాడలో రాష్ట్ర స్థాయి దీక్షలు చేపట్టి 24న నేరుగా జగనన్నకు చెబుదాం ఛలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.విఆర్ఎ ల సంఘ కార్యదర్శి జల్లి రాంజీ,గౌరవ అధ్యక్షులు నేదునూరి పట్టాభి రామయ్య, దోనిపాటి రెడ్డి,మధుర పరంజ్యోతి,మాగాపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం విఆర్ఎల సమస్యలు వెంటనే పరిష్కరించాలంటూ కపిలేశ్వరపురం తాసిల్దార్ కార్యాలయం ఎదుట విఆర్ఎలు గురువారం ధర్నా నిర్వహించారు. వీఆర్ఏల రాష్ట్ర సంఘం పిలుపు మేరకు నిర్వహించిన ఈ ధర్నాను ఉద్దేశించి అధ్యక్ష, కార్యదర్శులు, పలివెల నాగేశ్వరరావు ,కె శ్రీనివాసరావు లు మాట్లాడుతూ విఆర్ఎల వేతనం రూ.21 వేలు ఇవ్వాలని తదితర న్యాయమైన డిమాండ్ల పరిష్కరించా లన్నారు. అనంతరం తహశృల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ కె.సూర్యరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విఆంఎల సంఘం ఉపాధ్యక్షుడు అరపాక శివప్రసాద్, ముమ్మిడి వరపు జానకి బాబు, సాకా వీర్రాజు, పలివెల సూర్య ప్రకాష్ , తిప్పర్తి నారాయణరావు ,కప్పల చంద్రశేఖర్, మండలంలోని విఆర్ఎలు పాల్గొన్నారు.

ఆలమూరు విఆర్ఎల న్యాయమైన డిమాండ్ల ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని మండల పరిధిలోని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం ఎదురుగా గురువారం వారు నిరసన వ్యక్తం చేశారు. వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు రెండు రోజుల పాటు మండల కేంద్రంలో నిరసన దీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. నెలకు కనీసం రూ.26 వేలు జీతం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండుచేస్తున్నామని అన్నారు. ఇప్పటికయినా ప్రభుత్వం తమ పరిస్థితిని అర్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విఆర్ఎల సంఘ అధ్యక్ష, కార్యదరస్సులు తాతపూడి ఇస్సాక్, కంతేటి శివరామారావు, విఆర్ఏలు షేక్ బషీర్ బిబి, యార్లగడ్డ శిరీష, చోడవరపు రామలక్ష్మి, బూరుగు మంగాలక్ష్మి, ఏడిద వెంకటాద్రి, కుందేటి శ్రీను, భువనగిరి ఏసు, యార్లగడ్డ జీవరత్నం, తదితరులు పాల్గొన్నారు.

రాజోలు గ్రామ రెవెన్యూ సహాయకుల న్యాయ బద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని విఆర్ఎల సంఘం అధ్యక్షుడు దారపురెడ్డి వీరభద్రం అన్నారు. గురువారం రాజోలు తహాశీల్దార్ కార్యాలయ ఆవరణలో సిఐటియూ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈసందర్భగా వీర భద్రరావు మాట్లాడుతూ అర్హత ఉన్న వారికి విఆర్ఒ లుగా పదోన్నతి కల్పించాలని తదితర డిమాండ్ల సాధన కోసం రెండు రోజుల పాటు నిరసన దీక్ష చేపదుతున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో రాజోలు మండల అధ్యక్షుడు అల్లూరి రమణ, సోడదాసు సునీల్ రాజా,కలిగితి నాగేశ్వర రావు,కట్టా సత్యనారాయణ, చాగంటి రాజు, కుసుమ రామకృష్ణ తదిరులు పాల్గొన్నారు.



ఉప్పలగుప్తంలో రిలే దీక్షలు చేస్తున్న విఆర్ఎ లు



రాజోలుల్లో రిలే దీక్షలు చేస్తున్న దృశ్యం

రాజకీయ పార్టీలతో ఆర్‌డిఒ సమావేశం

ప్రజాశక్తి-రామచంద్రపురం

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం ఆర్‌డిఒ పి.సింధు రామచంద్రపురం కార్యా లయం లో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. నెం. 42 రామచంద్రపురం అసెంబ్లీ నియోజక వర్గం లోని గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీ నాయకులతో స్పెషల్ సమ్మరీ రివిజన్, యాక్టివిటీస్, పోలింగ్ భూత్ అధికారులు 21. వ తేదీ నుండి జరుగు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారని ఏమైనా ఓట్లు తొలగించవలసినా, కొత్తగా నమోదు చేసుకొనవలసినా ఓట ర్లకు సంబంధించి ఏమైనా మార్పులు ఉన్నచో వాటిని పరిశీలించుకో వాలన్నారు. వారి నుంచి సూచనలు,సలహాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, కె.గంగవరం, డిప్యూటీ తహశీల్దార్లు, కాజులూరు, రామచంద్రపురం మండలరెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఓటర్ల జాబితా తనిఖీ

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఈనెల 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు ఇంటింటా ఓటర్ల జాబితా తనిఖీ జరుగుతుందని తహశీల్దార్ జె.వెంకటేశ్వరి తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం నిర్వహించిన సమావేశంలో తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలో మొత్తం 44,174 మంది ఓటర్లు ఉండగా అందులో 22,615 మంది పురుష ఓటర్లు, 21,559 మంది మహిళా ఓటర్లు ఉన్నారన్నారు.ఎన్నికల కమిషన్ ఆదేశాలు మేరకు పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల వివరాలు తనిఖీ చేస్తామ న్నారు. బిఎల్ఒలు ఇంటింటికీ వచ్చి కొత్త ఓటర్ల చేర్పులు, చనిపోయిన, శాశ్వత వలస వెళ్లిన వారి ఓట్ల తొలగింపు ఓటర్ల జాబితాలో తప్పులు సవరణ చేస్తామన్నారు. ఇందులో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల తరపున బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొనవచ్చన్నారు. ఈ వ్యవహారాల్లో వాలంటీర్లకు ఏ విధమైన ప్రమేయం ఉండదన్నారు. సమావేశంలో వైసిపి, టిడిపి, కాంగ్రెస్ పార్టీల మండల అధ్యక్షులు బద్రి బాబ్జి, అరిగెల నానాజీ, పోలిశెట్టి హరిబాబు, బిఎస్‌పి నియోజకవర్గ అధ్యక్షుడు పెండెం శ్రీనివాస్ తదితరులుపాల్గొన్నారు.



కామనగరువులో భూమి పూజ చేస్తున్న సర్పంచ్

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి -అమలాపురం రూరల్

కామనగరువు పంచాయతీ 1వ వార్డు జంగంపాలెం వద్ద సిసి రోడ్డు నిర్మాణానికి గురువారం సర్పంచ్ నక్క అరుణ్ కుమారి భూమి పూజ చేశారు. గడప..గడపకూ మన ప్రభుత్వం గ్రాంట్ నుంచి మంజూరైన రూ.5 లక్షలతో సిసి రోడ్డు నిర్మిస్తున్నట్లు ఆమె తెలిపారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ ఆదినారాయణ, నక్క చంద్రశేఖర్, చోల్లంగి శ్రీనివాసరావు, కాంట్రాక్టర్ గణేష్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



కుర్చీలు బహుకరిస్తున్న పిఆర్‌టియు యూనియన్

పిఆర్‌టియు మండల అధ్యక్షునిగా పల్లంరాజు

ప్రజాశక్తి-మామిడికుదురు

మండలం పిఆర్‌టియు అధ్యక్షునిగా యాళ్ళ పల్లంరాజు, ప్రధాన కార్యదర్శిగా చింతా రమేష్, ఆర్థిక కార్యదర్శిగా కెవిడి.ప్రసాద్, గౌరవ అధ్యక్షులుగా చప్పిడి వెంకటేశ్వరరావు, సలహాదారులుగా ఎల్. శ్రీమన్నారాయణ, కార్యవర్గ సభ్యులు ఎన్నిక గురువారం మామిడికుదురు మండలంలో జరిగింది. విద్యాశాఖ అధికారి లక్ష్మీ నారాయణ, విద్యాశాఖాధికారి-2 ఎ. వెంకన్న బాబులను కలసి నూతన కార్య వర్గాన్ని పరిచయం చేశారు. మండల ఎంఆర్ సి కార్యాలయానికి పిఆర్‌టియు యూనియన్ కుర్చీలను బహూకరించారు. ఉపాధ్యా యు ల సమస్యలపైఎంఇఒలకు వినతిపత్రం అందజేశారు.

'కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి '

ప్రజాశక్తి-రాజోలు

కాంగ్రెస్‌పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా కిసాన్‌కేత్ మజూర్ అధ్యక్షులు రాజోలుకు చెందిన దేశనీడి భాస్కరరావు అన్నారు. ఆయన జిల్లా కిసాన్‌కేత్ మజూర్ అధ్యక్షునిగా నియమితులయ్యారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కామన ప్రభాకరావు చేతులమీదుగా ఉత్తర్వులు అందుకున్నారు. కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి అప్పన శ్రీరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

హుండీల ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి-యంత్రాంగం


జిల్లాలోని ప్రముఖ ఆలయాల్లో హుండీలను గురవారం లెక్కించారు. వివరాలు ఇవి..

అయినవిల్లి అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి హుండీలను లెక్కింపు గురువారం నిర్వహించారు. 56 రోజులకు ఆలయ హుండీల నుండి వెరసి మొత్తం రూ.21, 31,347, బంగారం 42 గ్రాములు, వెండి 1083 గ్రాములు , విదేశీ నోట్లు 38 వచ్చాయని ఆలయ ఇఒ అధికారి ముదునూరు సత్యనారాయణ రాజు తెలిపారు. హుండీ లెక్కింపులో జంపా రామలింగేశ్వర రావు డివిజనల్, తనిఖీదారు అమలాపురం, ఆలయ ఛైర్మన్ నంబూరి వెంకటరమణ రాజు మరియు ఆలయ ధర్మకర్తల మండలి, గ్రామస్థులు, సేవాదళ సభ్యులు, దేవస్థానము సిబ్బంది పాల్గొన్నారు.

అమలాపురం అమలాపురంలో భూసమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన ముడుపులను, మొక్కుబడులు హుండీ ఆదాయం14,36,198 లక్షల ఆదాయం చేకూరింది. ముమ్మిడివరం గ్రూప్ టెంపుల్స్ ఇఒ పికె.లక్ష్మణరావు ఆధ్వర్యంలో గురువారం లెక్కించారు. గత ఏడాది వచ్చిన ఆదాయం కంటే ఈ ఏడాది రెట్టింపు వచ్చిందని ఆలయ ఇఒ దూనబోయిన సాయిబాబు అన్నారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో చైర్ పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, దూడల ఫణి ధర్మకర్తలి మండలి సభ్యులు, సేవాసమితి సభ్యులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



అయినవిల్లి విఘ్నేశ్వరాలయంలో హుండీలెక్కింపు



అమలాపురంలో వెంకన్న ఆలయంలో..

సిఎం పర్యటనను జయప్రదం చేయాలి

అమలాపురం : సిఎం జగన్ అమ లాపురం నుంచి సున్నా వడ్డీ రాయితీ నిధులు ఈనెల 26న స్వయం సహాయ సంఘాలకు బటన్ నొక్కి జమ చేసే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మంత్రి పినిపే విశ్వరూప్ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అధికారులతో సిఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు. మంత్రి మాట్లాడుతూ జిల్లా కలెక్ట అధికారులకు కేటాయించిన విధులను సమర్ధ వంతంగా నిర్వహించాలని సూచించారు. సభాస్థలికి అమలాపురం చుట్టు పక్కల మండలాల పరిధిలోని మహిళలు వచ్చే అవకాశం ఉన్నదని దూర ప్రాంతాలలో వచ్చే మహిళలకు అల్పాహారం భోజనం వసతిని సంబంధిత ఎంపిడిఒల సమన్వయంతో కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, డిఆర్‌ఓ సిహెచ్.సత్తిబాబు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, మున్సిపల్ కమిషనర్ విఐపి నాయుడు జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సత్యవాడ మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి-రామచంద్రపురం



కె.గంగవరం మండలంలో సత్య వాడ గ్రామ మాజీ సర్పంచ్ తోట ఈశ్వరకృష్ణ నాగ సర్వారాయుడు అలియాస్ కాశి గురువారం అకస్మికంగా మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంగా బాధపడుతున్న ఆయన హైదరాబాదులో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. 2001- 2007 సంవత్సరంలో ఆయన గ్రామ సర్పంచ్‌గాను అటు తరువాత నీటి సంఘం అధ్యక్షులుగా కొనసాగారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆయన మృతికి గ్రామ సర్పంచ్ సలాది శీను, బండారు చినబాబు, సొసైటీ అధ్యక్షులు ఆడప నారాయణస్వామి, ఎంపిటిసి సభ్యురాలు సలాది ఆదిలక్ష్మి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఆలమూరు

పెదపళ్లకు చెందిన గొడితి త్రిమూర్తులు పాత గృహం శిథిలమై కూలి పోయింది. అయితే ఆయన నూతన గహాన్ని నిర్మించుకునే స్థితిలో లేకపోవడంతో త్రిమూర్తులుకు ఇంటిని నిర్మించి ఇచ్చేందుకు పెదపళ్ళకు చెందిన పలువురు పెద్దలు విరాళాలు సమకూర్చి అందజేశారు. విషయం తెలుసుకున్న పారిశ్రామికవేత్త వంటిపల్లి పాపారావు జరుగుతున్న ఆ ఇంటి నిర్మాణానికి గురువారం రూ.15 వేలు సాయం అందించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ అల్లూరి సత్యనారాయణ, సొసైటీ ఛైర్మన్ నెక్కంటి వెంకటరాయుడు, గ్రామ టిడిపి అధ్యక్షుడు గొడవర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సాయం అందజేస్తున్న పాపారావు

నిషేధిత ఆన్‌లైన్ యాప్‌లను కట్టడి చేయాలి

ప్రజాశక్తి-అమలాపురం

యువతను పెడత్రోవ పట్టించే నిషేధిత ఆన్ లైన్ యాప్ లను కట్టడి చేయడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాల్సిందిగా కోరుతూ గురువారం ఎఐవైఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ పరిపాలనాదికారి కె.కాశి విశ్వేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఆన్లైన్లో రమ్మి వెబ్ సైట్ లను, బెట్టింగ్ యాప్ లను నిషేధించాలని, లివింగ్ డేటింగ్ ఫ్రెండ్షిప్ యాప్ లను నిషేదించాలని కోరారు.సైబర్ ముఠాలపై చర్యలు తీసుకొని ఆన్లైన్ మోసాలను అరికట్టాలని కోరారు. ఆయా అంశాలపై ప్రభుత్వం తీసుకొనే చర్యలకు ఎఐవైఫ్ పూర్తి సహాయ సహకారాలు అందజేస్తుందని జిల్లా కన్వీనర్ బి. బాలకృష్ణ, కో కన్వీనర్ యు.సురేష్,కో ఆర్డినేటర్ కె. సత్తిబాబులు తెలియజేశారు.

కార్టూ'నిజం'



అధికారపక్షం వాళ్లనేమైనా విమర్శించారా... ఇడి వాళ్లొచ్చారు..!!

నేరాలు ఘోరాలు

ఆర్ఎంపి వైద్యం పేరుతో చోరీలు

ప్రజాశక్తి-కాకినాడ క్రైం

దీర్ఘకాల సమస్యలతో బాధ పడుతున్న వద్ధులను లక్ష్యంగా చేసుకొని వారికి అవసరమైన మందులు ఇస్తానని చెప్పి వారి ఒంటి మీద బంగారు వస్తువులు దొంగలించి పారిపోయే ఒక ఆర్ఎంపిని పెదపూడి పోలీసులు పట్టుకున్నారు. దీనికి ఎస్పి ఎస్.సతీష్ కుమార్ కాకినాడలోని తన కార్యాలయంలో గురువారం వివరాలు వెల్లడించారు. కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెంనకు చెందిన గిరుతూరి విశ్వనాథం ఆర్ఎంపి వైద్యునిగా చెప్పుకుంటూ వివిధ గ్రామాల్లో ఉన్న వద్ధులను లక్ష్యం చేసుకునేవాడు. ఒంటిపై ఉన్న బంగారు వస్తువులు తీసి పక్కన పెట్టాలని అలా పెట్టకపోతే ఇంజెక్షన్ ఇన్ఫెక్షన్ వస్తుందంటూ మాయమాటలు చెప్పి బంగారు వస్తువులను దొంగలించుకోవడం అలవాటుగా చేసుకున్నారన్నారు. ఎస్ఐ.పివాసు బందం అతడిని అరెస్టు చేసి 164 గ్రాముల బంగారం, రూ.30 వేల నగదు, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. జిల్లా అదనపు ఎస్పీ పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

గొల్లప్రోలులో విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి-గొల్లప్రోలు (పిఠాపురం)

గొల్లప్రోలులో రీజనల్ విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి కె.కుమార్ ఆధ్వర్యాన గురువారం సివిల్ సప్లయి, లీగల్ మెట్రాలజీ అధికారులు పలు షాపులను తనిఖీ చేశారు. వెంకటనాగలక్ష్మి ట్రేడర్స్‌లో రెండు కేసులు, శ్రీ సాయి శివ కష్ణ జనరల్ స్టోర్‌లో లీగల్ మెట్రాలజీ అధికారులు ఒక కేసు, శ్రీ లక్ష్మీ గణపతి ఆయిల్ జనరల్ స్టోర్‌లో సివిల్ సప్లయిస్ షాపు యజమానిపై 6 ఎ కేసు నమోదు చేసి రూ 2,11,750 విలువైన పప్పు ధాన్యాలను సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో కార్యాలయ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, తహశీల్దార్ విజయ కుమార్, కానిస్టేబుల్స్ లోవ కుమార్,లోవరాజు పాల్గొన్నారు.

తోట నరసింహంతో చర్చకు సిద్ధం

ప్రజాశక్తి-జగ్గంపేట

ఆత్మీయ సమావేశాల పేరుతో ఎంఎల్ఎ చంటిబాబును విమర్శిస్తున్న మాజీ మంత్రి తోట నరసింహంతో చర్చలకు సిద్ధమేనని జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జె.సుబ్బారావు ప్రకటించారు. వైసిపి నాయకులతో కలిసి గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి పార్టీ శ్రేణులను, ఎంఎల్ఎ చంటిబాబును విమర్శించడం సరికాదన్నారు. పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ మిథున్ రెడ్డి ముందుకు ఈ విషయాన్ని తీసుకెళ్లామన్నారు. గోకవరం మండలంలోని కామరాజుపేటలో ఆత్మీయ సమావేశం పేరుతో ఎంఎల్ఎ చంటిబాబును, తనను కూడా విమర్శించారన్నారు. పార్టీకి నష్టం కలిగించే సభలను పెట్టకుండా ఉంటే మంచిదన్నారు. ముఖాముఖి చర్చకు సిద్ధమేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట ఎంపిపి అత్తులూరి నాగబాబు, కిర్లంపూడి ఎంపిపి తోట రవి, గండేపల్లి ఎంపిపి చలగళ్ల దొరబాబు, కిర్లంపూడి సొసైటీ చైర్మన్ బాబి, గోకవరం ఎంపిపి సుంకర శ్రీవల్లి వీరబాబు, కుంచే జాస్తి వసంత్, రాజా, కందుల చిట్టిబాబు, ముమ్మన్న సోమరాజు, రాష్ట్ర సీడ్స్ కోఆర్డినేటర్ అప్పారావు, లక్ష్మణ దొర, ఒంటిపల్లి రామన్న దొర పాల్గొన్నారు.

యానాం వార్తలు

ఉధృతంగా గౌతమీ గోదావరి

ప్రజాశక్తి - యానాం

ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ రాష్ట్రాల నుంచి వస్తున్న వరద కారణంగా యానాం గౌతమి గోదావరి నది బాలయోగి వారధి వద్ద వరద నీరు ఉధతంగా ప్రవహిస్తోంది. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయడంతో యానాం అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి గురువారం గోదావరి నది తీరాన్ని పరిశీలించారు. అధికారులు, లోతట్టు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

8న యోగా శిక్షకులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - యానాం

యానాం రీజినల్, స్టేట్ హెల్త్ సొసైటీల ఆధ్వర్యంలో యోగా శిక్షకుల నియామకానికి ఆగస్టు ఎనిమిదో తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మిషన్ డైరెక్టర్ జి.శ్రీరాములు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు పోస్టులకు సంబంధించి ఇంటర్వ్యూలు యానాంలో నిర్వహిస్తారన్నారు వివరాలకు health.py.gov.inలో చూడాలన్నారు.

తోటి డ్రైవర్‌కు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - యానాం

యానాం టాక్సీ స్టాండ్‌లో డ్రైవర్ సొర్రా నాగు గాడయపడడంతో తోటి డ్రైవర్లు రూ.15 వేల విరాళాలు సేకరించి సాయం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్, సిఐటియు కన్వీనర్ కుంచే సత్యనారాయణ డ్రైవర్లను అభినందించారు. ప్రభుత్వం నుండి ఎలాంటి సహకారం అందకపోయినా సాటి డ్రైవర్‌ను ఆదుకోవడంలో డ్రైవర్లు ముందుకు రావడం సంతోషమన్నారు.

ఎంఎల్ఎ అశోక్‌కు ఆర్ఎఒ పరామర్శ

ప్రజాశక్తి - యానాం

ఇటీవల కాలుకు శాస్త్ర చికిత్స చేయించుకున్న యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి పరామర్శించారు. గురువారం స్థానిక గోపాల్ నగర్‌లోని ఎంఎల్ఎ నివాసానికి వెళ్లి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఏజెంట్స్, అధికారులను నియమించాలి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

నేటి నుంచి వచ్చే నెల 21వ తేదీ వరకు ఇంటింటికీ ఓటర్ సర్వే చేపడతామని, వార్డులో ఉన్న రాజకీయ పార్టీ నాయకులు తమ బూతు లెవెల్ ఏజెంట్ అధికారులను నియమించుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ రావిరాల మహేష్ కుమార్ పేర్కొన్నారు ౹రువారం కార్పొరేషన్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీ నాయకులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఉన్న ప్రతి ఒక్కరికి ఓటర్ ఐడి ఏర్పాటు చేశామన్నారు. వీరికి ఎవరు అందుబాటులో ఉన్నారు, ఎవరికి కొత్త ఓటు రావాలి, మార్పులు చేర్పులు ఇతర అంశాలపై సర్వే ప్రారంభించినట్టు చెప్పారు. ఎటువంటి తప్పులకూ లోను కాకుండా అన్ని రాజకీయ పార్టీ నాయకులు అందరూ ఏజెంట్లను నియమించుకుంటే బాగుంటుందన్నారు. సర్వే సజావుగా సాగేలా అధికారులు కృషి చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు.

మాచరలో గడప గడపకూ..

ప్రజాశక్తి -కపిలేశ్వరపురం

మండలంలోని మాచరలో గురువారం గురువారం గడప..గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఎంఎల్సి తోట త్రిమూర్తులు, గ్రామ వైసిపి నాయకులతో ఇంటింటా తిరిగి ప్రజల సమస్యను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామంలో సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి తదితరులు, పాల్గొన్నారు.


సీజనల్ వ్యాధుల నివారణకు జాగ్రత్తలు

ప్రజాశక్తి-పెదపూడి

వారం రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని సచివాలయం కార్యదర్శులు అప్రమత్తంగా ఉండి అవసరమైన చర్యలు చేపట్టాలని కాకినాడ డిఎల్‌పిఒ టి.అన్నామణి అన్నారు. పెదపూడి సచివాలయాన్ని ఆమె గురువారం ఆకస్మికంగా సందర్శించారు. పలు రికార్డులు పరిశీలించారు. అంతకు ముందు గ్రామంలో పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య చర్యలు మరింత మెరుగుపర్చాలన్నారు. వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయని దీంతో అంటువ్యాధులు ప్రబలి అవకాశ ఉందన్నారు. ఆరోగ్యశాఖ సిబ్బంది. సచివాలయం సిబ్బంది గ్రామాల్లో పర్యటించి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డెంగీ, వైరల్ జ్వరాలు సోకకుండా ముందుగానే తగిన చర్యలు చేపట్టాలన్నారు. మురుగు గుంటల్లో బ్లీచింగ్ చల్లించాలన్నారు. తాగునీరు క్లోరినేషన్ చేసి సరఫరా చేయాలన్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారందకి నిబంధనల ప్రకారం అందించాన్నారు. సచివాలయం సేవలను ప్రజలకు అందుబాటులో అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి మన్యం శ్రీనివాసు చౌదరి, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, బాలాత్రిపుర సందరి తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్



సమావేశంలో చర్చిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామారావు

పట్టణ పరిధిలో పెండింగ్‌లో ఉన్న టిడ్కో లబ్ధిదారులకు రుణాలును బ్యాంకర్లు సత్వరమే మంజూరు చేయాలని సామర్లకోట మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు విజ్ఞప్తి చేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో పట్టణ పరిధిలో ఎన్న పలు బ్యాంకుల మేనేజర్లతో టిడ్కో లబ్ధిదారుల రుణాల మంజూరు పెండింగ్ అంశంపై చర్చించారు. పెండింగ్ రుణాలును సత్వరమే మంజూరు చేయాలని కమిషనర్ కోరారు. మృతులు, సిబిల్ ప్రాబ్లమ్స్, అధిక వయస్సు వారి సమస్యలను మున్సిపాల్టీ ఆధ్వర్యంలో సతర్వమే పరిష్కరిస్తామని కమిషనర్ చెప్పారు. రుణాలు మంజూరు కాకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే రుణాలు మంజూరు చేయాలని కమిషనర్ రామారావు సూచించారు. ఈ సమావేశంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ పి.సుజాత, సిఒలు పి.ప్రసాద్, నర్గీస్ పాల్గొన్నారు.

విఆర్ఎలకు డిఎతో కూడిన వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

విఆర్ఎలకు డిఎతో కూడిన వేతనం చెల్లించాలని కోరుతూ ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం సభ్యులు ప్రత్తిపాడు తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు ప్రతిపాడు మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ ఐదేళ్లు నిండిన విఆర్ఎలను విఆర్ఒలుగా నియమించాలని, మరణించిన విఆర్ఎల కుటుంబాలకు ఉద్యోగం ఇవ్వాలని, విఆర్ఎలకు కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనకు కాంగ్రెస్ పార్టీ ప్రతిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉమ్మిడి వెంకట్రావు, జనసేన నాయకులు నల్లల రామకృష్ణ, శేషారావు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమరగిరి రామకృష్ణ, ఎం.సత్తిబాబు, వి.దాసు, ఎం.గంగరాజు, బి.తాతబ్బాయి, శోభ, కుమారి తదితరులున్నారు.

లయన్స్ ఆధ్యర్యాన సామాజిక సేవలు

ప్రజాశక్తి-అన్నవరం



ప్రమాణ స్వీకారం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేటి సమాజంలో పేద మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడే పలు సామాజిక సేవా కార్యక్రమాలకు అన్నవరం సత్యదేవ లయన్స క్లబ్ దోహదపడుతుందని శంఖవరం ఎంపిపి పర్వత రాజబాబు అన్నారు. గురువారం అన్నవరంలో సత్యదేవ లైన్స్ క్లబ్ ఆఫ్ అన్నవరం కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో ఎంపిపి రాజబాబు, లయన్స్ రీజనల్ చైర్మన్ పర్వత జానకి రాజబాబు మాట్లాడారు. ముందుగా క్లబ్బు నూతన అధ్యక్షునిగా పసగడుగుల నానాజీ, కార్యదర్శిగా పంచాది గుర్రాజు, కోశాధికారిగా కాలి బోయిన సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో డొంకాడ గిరి పంచాది సునీత గుర్రాజు, రమేష్‌బాబు, ఎం.అర్జున్‌రావు పాల్గొన్నారు.

రోడ్డుపై వర్షపు నీటితో అవస్థలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్ళరేవు పంచాయతీ చెరువుగట్టు సెంటర్ వద్ద ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో మెయిన్ రోడ్‌పై వర్షం నీరు పోయేందుకు పంచాయతీ సిబ్బంది కచ్చ డ్రైన్ ఏర్పాటు చేసేవారు. ఈ ఏడాది ఎటువంటి కచ్చా డ్రైన్ నిర్మించక పోవడంతో మెయిన్ రోడ్డు పైనే వర్షపు నీరు నిలిచిపోతోంది. దీనికి తోడు ఆ ప్రాంతంలో షాపింగ్ కాంప్లెక్స్, గృహ నిర్మాణాలు జరుగుతున్నాయి. వాటికి చెందిన ఇసుక, ఇటుక, కంకర వంటి మెటీరియల్ రోడ్డుపైనే వేశారు. దీంతో బయటికి వెళ్లే దారి లేక మెయిన్ రోడ్డుపై నిలిచిపోయింది.

ఎంబిబిఎస్ సీట్లపై ఉత్తర్వులు తగవు

ప్రజాశక్తి-కాకినాడ

అదనపు ప్రభుత్వ వైద్యకళాశాలల్లో 50 శాతం ఎంబిబిఎస్ సీట్లకు సెల్ఫ్ ఫైనాన్స్ ద్వారా కేటాయింపులు చేపట్టడం మంచి పద్ధతి కాదని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు పేర్కొన్నారు. మూడు కేటగిరీల్లో రూ.15 లక్షలు, రూ.12 లక్షలు, రూ.20 లక్షలు వసూలు చేయాలని ఆరోగ్యశాఖ ఉత్తర్వులు విడుదల చేయడం ప్రభుత్వ విధానాలకు మంచి పరిణామం కాదన్నారు. తెలంగాణలో ఇటువంట విధానం లేదన్నారు.

వ్యాసరచన పోటీల్లో డిగ్రీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మండపేట

స్థానిక మారేడుబాక రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా రెడ్ క్రాస్ సంస్థ రక్తదానం అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో డిగ్రీ విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. బిఎ మొదటి సంవత్సరం చదువుతున్న పిల్లి రాధిక, కోరుకొండ శాంతి, మహ్మద్ ఖదీర్ ముల్లా, ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాలు సాధించారు. జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ కె.సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపల్ డా.టికెవి.శ్రీనివాసరావు విజేతలను అభినందించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి రక్త దానం చేసి ప్రాణ దాతలుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ విభాగపతి డా. జె నెహ్రూ నాయక్, వైస్ ప్రిన్సిపల్ ఆనందరావు, లైబ్రేరియన్ వెంకన్న, అధ్యాపక, సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయం అభివృద్ధికి కృషి చేయండి

ప్రజాశక్తి - పెద్దాపురం

ఆధ్యాత్మిక సేవా భావనతో పాలక మండలి సభ్యులు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. తిరుపతి శ్రీ శృంగార వల్లభ స్వామి ఆలయ నూతన పాలక మండలిసభ్యుల ప్రమాణ స్వీకారంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. నూతన చైర్మన్‌గా కర్రి వెంకట జగదీశ్వరరావు, పాలకమండలి సభ్యులుగా కుంచే వెంకటరమణ, రాకుర్తి కుమారి, అమలదాసు లక్ష్మి, అడబాల జగ్గారావు, అడపా శివ, పుల్లేటి కుమారి, ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఆలయ అర్చకులు పెద్దింటి నారాయణచార్యులుతో ఆలయ ఇఒ పులి నారాయణమూర్తి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతన పాలకమండలి సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, ఎంపిపి పెంకే సత్యవతి, వైస్ ఎంపిపి మిర్యాల రాజా, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు గోపు నారాయణమూర్తి, కంటే వీరరాఘవరావు, గోపు మురళి, జెడ్‌పిటిసి కుంచే బుచ్చిరాజు, ఆవాల లక్ష్మీనారాయణ, కనపర్తి సీమ దొర, ఒబిలిశెట్టి అబ్బాయి, వినుకొండ వీర విష్ణు చక్రం, శైల గణేష్, బర్రే రామ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన వైసిపి ప్రభుత్వానికే సాధ్యం

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రజలందరికీ సంక్షేమ ఫలాలను అందించే పాలన వైసిపి ప్రభుత్వానికే సాధ్యమవుతుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరు దొరబాబు అన్నారు. గురువారం స్థానిక 4వ సచివాలయం పరిధిలోని 6, 7 వార్డుల్లో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలకు వైసిపి సంక్షేమ పాలనపై వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర, ఎఎంసి వైస్ చైర్మన్ బందారు వీరబాబు,కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, కాపుగంటి సౌందర్య లక్ష్మి, టిపిఒ ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నారుమడుల్లో నీటిని తొలగించాలి

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు నారు మళ్ళు ముంపునకు గురవుతున్నాయని, రైతులంతా వర్షం తగ్గిన వెంటనే పొలంలో నీటిని తొలగించి ఆరుదల పెట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు పేర్కొన్నారు. గురువారంపాలగుమ్మి,నల్లమిల్లి గ్రామాల్లో ఆర్‌బికెలను సందర్శించి రిజిస్టర్లు, కియోస్కు, కొత్తగా నిర్మిస్తున్న ఆర్‌బికెలను పరిశీలించారు. పాలగుమ్మి లో వరి చేలు పరిశీలించి ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు సూచనలు చేశారు.నల్లమిల్లి లో నారు మడులను పరిశీలించి అధిక వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో జరుగు నష్టం గురించి రైతులకు సూచనలు ఇచ్చారు. జిల్లాలోని రైతులందరూ జాగ్రత్తలు పాటించి తమ పంటలను రక్షించుకోవాలని జిల్లా తెలియజేశారు. కార్యక్రమంలో అమలాపురం సహాయ వ్యవసాయ సంచా లకులు ఎంఎ షంషి, మండల వ్యవసాయ అధికారి కె.ధర్మ ప్రసాద్, ఎఇఒ, వ్యవసాయ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం డివిజన్ పరిధి లోగల ఈదరపల్లి 33/11 కెవి స్టేషన్, బాలయోగి ఘాట్ 33/11 కెవి సబ్ స్టేషన్, లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారము ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని డిఇ ఎమ్.రవికుమార్ గురువారం తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ల పరిధిలో గల ఆర్‌టిసి రోడ్డు, నారాయణపేట కె.అగ్రహారం, హైస్కూల్ రోడ్, సూర్యనగర్, భూపయ్య అగ్రహారం, కాలేజీ రోడ్ ముమ్మిడివరం గేట్ గవర్నమెంట్ హాస్పిటల్ విద్యుత్ నగర్, సావరం, ఆర్డీవో ఆఫీస్ రోడ్, నల్లవంతెన, కలెక్టర్ ఆఫీస్ జనుపల్లి, ఎ.వేమవరం, మాగం, నేదునూరు, ఈదరపల్లి, ఇందుపల్లి, బండారులంక ప్రాంతాలలో విద్యుత్ కు అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు. **అయినవిల్లి** మండలంలో అయినవిల్లి సబ్‌స్టేషన్ పరిధిలో గల అయినవిల్లి, ముక్తేశ్వరం, మూలపాలెం, కె.జగన్నాధపురం విద్యుత్ వినియోగదారులకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు ట్రాన్స్ ఫార్మర్ మరియు ఎబి స్విచ్‌ల మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని గురువారం మండల విద్యుత్‌శాఖాధికారి వి.శ్రీనివాసరావు తెలిపారు

పలుచోట్ల 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల జగనన్న సురక్ష కార్యక్రమం గురువారం నిర్వహించారు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని అర్హులకు ధృవపత్రాలు అందజేశారు. వివరాలు ఇవి..

రామచంద్రపురం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా రామచంద్రపురం మండలం వెలంపాలెం గ్రామం సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన సభలో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకష్ణ పాల్గొని ప్రసంగించారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 99శాతం మంది అర్హులైనలబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాలుచేరాయన్నారు.కార్యక్రమంలో రామచంద్రపురం ఎంపిపి అంబటి భవాని, తహశీల్దార్ తేజేశ్వరరావు, వైస్ ఎంపిపి నరాల రాజ్యలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యుడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **అయినవిల్లి** జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని పి గన్నవరం నియోజకవర్గ ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు అన్నారు. గురువారం తొత్తరమూడి గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ వార జయ సావిత్రి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఎల్ఎ లబ్ధిదారులకు ధృవపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపిడిఒ వెంకటాచార్యులు, డిటి అశోక్, వైస్ ఎంపిపి బి.చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ బోధనతో భవిష్యత్తుకు బాటలు

ప్రజాశక్తి-ఆలమూరు

ప్రణాళిక బద్ధంగా ఉత్తమ బోధనతో కూడిన పాఠాలు నేర్పుతూ విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలని ఇంఛార్జి డివైఇఒ, స్థానిక 1వ మండల విద్యాశాఖ అధికారి పి.షాలెంరాజు అన్నారు. గురువారం ఆయన సాధారణ తనిఖీల్లో భాగంగా మండల పరిధిలోని వివిధ పాఠశాలలను సందర్శించారు. ఇందులో భాగంగా ఎండిఎంలో నాణ్యతలను, పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల విద్యా వ్యవస్థపై ప్రత్యేక నిఘా ఉంచి ప్రభుత్వం చేపట్టే ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలుపరిచేలా తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలలు హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-మండపేట

చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని జిల్లా దిశ డిఎస్‌పి మురళీమోహన్ అన్నారు. గురువారం మండలంలోని ద్వారపూడి జెడ్‌పి బాలిక ఉన్నత పాఠశాలలో దిశ చట్టం, మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం జరిగింది. పలువురు మాట్లాడుతూ గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్, చైల్డ్ ఫోర్నోగ్రఫీ, ఈవ్ టీజింగ్, మహిళా చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ తులా శేషారావు, రూరల్ ఎస్ఐ శివకష్ణ, గ్రామ పెద్దలు, స్కూల్ హెచ్ఎం, టీచర్స్ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంతర్ జిల్లాల బాస్కెట్ బాల్ పోటీలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం కత్తివెంటి పేర్రా జు పంతులు ప్రభుత్వ జాతీయ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఈనెల 21 నుంచి ఎనిమిదవ సబ్ జూనియర్స్ బాస్కెట్ బాల్ అంతర్ జిల్లాల ఛాంపియన్షిప్ పోటీలు నిర్వహిస్తారని నిర్వాహకులు గన్నమనేని చక్రవర్తి గురువారం తెలియజేశారు ఈ పోటీలు గన్నమని భానుమతి జ్ఞాపకార్థం నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు జరిగే ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 12 బాలుర,9 బాలికల జట్లు వస్తాయని రాష్ట్ర బాస్కెట్బాల్ ప్రధాన కార్యదర్శి చక్రవర్తి తెలిపారు రామచంద్రపురం బాస్కెట్బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలలో ఎంపికైన బాల బాలికల జట్లు ఆగస్టు రెండో తేదీ నుంచి పాండిచ్చేరిలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.

విద్యార్థుల పారిశ్రామిక పర్యటన

ప్రజాశక్తి-కాట్రేనికోన

చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల మూడవ సంవత్సరం బి టెక్ ఇసిఇ, విద్యార్థులు గురువారం పారిశ్రామిక పర్యటన చేశారు.. ఈ పర్యటన లో భాగముగా కళాశాల విద్యార్థులు అగపంపూడి విశాఖ జిల్లాలో పలు పలు ఫ్యాక్టరీలను సందర్శించారు. ఈ పర్యటన అనంతరం కళాశాల లో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్‌విఎస్ .పరమేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్జన దశలో ప్రతి విద్యార్థి ప్రత్యక్ష పరిశీలన విషయ జ్ఞానాన్ని ఆకళింపు చేసుకొనుట ద్వారా నూతన ఆవిష్కరణలకు నాంది ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డివిఎస్ఎస్.వర్మ, కళాశాల పాలకవర్గ సభ్యులు సందీప్ మరియు రమేష్ రాజు , ఇసిఇ విభాగపతి డాక్టర్ ఎస్ఎస్.శరవణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమిష్టిగా డోర్ టు డోర్ ఓటర్ సర్వే

ప్రజాశక్తి-పిఠాపురం

ఓటర్ల సర్వేలో భాగంగా బిఎల్ఒలు సమిష్టిగా ఓటరు జాబితాపై సమగ్ర సర్వే చేయాలని పిఠాపురం నియోజవర్గ ఎన్నికల అధికారి, కూడా చైర్మన్ కె.సుబ్బారావు అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో పిఠాపురం, గొల్లప్రోలు పరిధిలో రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ నెల 21 నుంచి వచ్చే నెల 21 వరకు డోర్ టు డోర్ ఓటర్ల జాబితాపై సమగ్ర సర్వే నిర్వహించాలన్నారు. ప్రధాన పార్టీల నుంచి బిఎల్ఎలు ప్రభుత్వ నుండి బిఎల్వోలు సర్వే పూర్తి చేయాలని పార్టీ నాయకులను కోరారు. పిఠాపురం పట్టణంలో అగ్రహారం మండలంలో చిత్రాడ ఒకే డోర్ నెంబర్‌తో 100 పైబడి ఓట్లు ఉన్నాయని అవి తమ దృష్టికి వచ్చాయని అయితే అక్కడ ఆక్రమించుకుని ఇల్లు నిర్మించుకున్న వారు ఉండడం చేత ఒకే డోర్ నెంబర్ తో అన్ని ఓట్లు ఉన్నాయని కలెక్టర్ అనుమతితో తాత్కాలిక డోర్ నెంబర్లు వేసి ఆధార్, ఓట్లు అడ్రస్సులు డోర్ నెంబర్లు మార్పు చేస్తామన్నారు. సమావేశంలో పిఠాపురం మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి, గొల్లప్రోలు నగర పంచాయతీ కమిషనర్ సత్య నారాయణ, పిఠాపురం తహశీల్దార్ పితాని త్రినాధ రావు, గొల్లప్రోలు తహశీల్దార్, కాంగ్రెస్ పార్టీ నుండి మేడిద శ్రీనివాసరావు, వైసిపి నుండి బొజ్జ దొరబాబు, టిడిపి నుండి అల్లుమల్లు విజయకుమార్, సిపిఐ నుండి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

నేటి నుంచి డోర్ టు డోర్ సర్వే

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఏలేశ్వరం మండలంలో జూలై 21 నుండి ఆగస్టు 21 వరకు డోర్ టు డోర్ సర్వే నిర్వహిస్తున్నామని తహశీల్దార్ చిన్నబాబు తెలిపారు. ఈ సర్వేలో ఆయా గ్రామాల బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితాలో మార్పులు చేర్పులతో పాటు నూతన ఓటర్లను చేర్పించడంతో పాటు ఓట్లను తొలగిస్తారని తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజలు సహకారం అందించాలని ఆయన కోరారు.